# స్వాతంత్ర్య పిపాసియైన భర్త

"నన్నెంతకాలం యిట్లా వేధించదల్చుకున్నావ్, ఈ ముసలితనంలో?" అవతలనించి సమాధానమేమీరాలేదు. ఎప్పుడూలేని తుఫానేదో రేగుతోంది. ఇంట్లో మెట్లెక్కకుండానే ఆ మాటలు వినేందుకు నిల్చుండిపోయాను.

"ఇదేం బాగులేదమ్మాయి! పెద్దదానవు. నువ్వు కూడా నా బాధ్యత ఆలోచించాలి. నేనేదో నాకోసరం దేవులాడుతున్నాననుకోకు".

"నాన్నా! మరి, నేనుమాత్రం ఏం చెయ్యను?" అంది సన్ననిగొంతు.

"ఎట్లా? ఏం చెయ్యకపోతే? ఎన్నాళ్ళని. ఒకయేడారెండేళ్ళా? నా జీవితాన్నన్నా చూచి, కొంచం జాగర్తగా ఆలోచించు".

కాసేపు నిశ్శబ్దం నేను మెల్లగా నాగదిలో ప్రవేశించాను. ముసలాయన దగ్గుతూ ఎక్కడికో వెళ్ళిపోతున్నచప్పుడు వినిపించింది. ముఖవర్చస్సుపట్టన్నా వాళ్ళఅభిప్రాయాలు తెల్సుకుందామని, గది గుమ్మందగ్గర నిలబడ్డాను.

విమల స్తంభం పట్టుకుని నించుంది. ముసలాయన కర్ర వూపుకుంటూ హడావుడిగా వెళ్ళిపోతున్నాడు.

నేను బయటికొచ్చిన చప్పుడు విన్నట్టుంది, "ఇందాకటినుంచి మా సంభాషణలు వింటూ ఇక్కడే వున్నారా?" అన్నట్టు ఆశ్చర్యంగా చూస్తోంది.

జుట్టంతా రేగివుంది. మనిషి ఎంతో అలసిపోయినట్టు కనబడుతోంది. కనుచూపుదూరమువరకూ ఆయన వెళ్ళడం చూసి సావిట్లోకి పోయింది.

"అసలు సంగతేమిటో అడుగుదామా?" అని తటపటాయించాను. ఏమో? ఏంబాధపడుతుందో తీరా అడిగితే? పోనీలే మనకెందుకు?" అనిపించింది.

కొత్తలో ఈవూళ్ళో యిళ్ళకరువువల్ల గదులెక్కడా అద్దెకు దొరకలేదు. ఒకవేళ ఎక్కడన్నా గదులున్నా "మేం సంసార్లకిగాని ఇవ్వం!" అని నిర్దయతో తిరుగగొట్టేవారు. హాస్టల్లో సీట్సులేవు.

అల్లాంటి పరిస్థితుల్లో ఎంతో కష్టం మీ్మద ఎక్కడో మూలవున్న ఈ ఇల్లు వెతికాను. అడిగి లేదనిపించుకొనడ మెందుకని అడగడమా మానేద్దామా అనుకున్నాను మొదట. కాని ఒకసారి అడిగిచూస్తే? అనే ఆశ తోద్పడింది.

నా వాలకమంతా చూచి ముసలాయన అన్నాడు "మేం గదులు అద్దికివ్వడానికి అలవాటుపడలేదు. సాధారణంగా మీ విద్యార్థుల కెవ్వరూ ఇవ్వరు. కాని నిన్ను చూస్తుంటే గది యివ్వవచ్చునని వుంది. ఏదో గౌరవమైన కుటుంబానికి చెందినవాడిలా వున్నావు. మంచిది చూసుకుని ప్రవేశించుగది నచ్చితే"నని.

"నా గొప్పతనం ఇంకా ముందు ముందు తెల్సుకుంటారులెండి" అనుకుని, మర్నాడు గదిలో ప్రవేశించాను.

క్రమక్రమంగా వాళ్ళతో బాగా పరిచయమ్మైంది. నా చదువుదగ్గర్నించి, రాజకీయాలవరకూ చర్చించేవాళ్ళం.

నేను "పారిస్‌పతనం" ఇంకా ఇల్లాంటి పుస్తకాలు విమలకు చదువుకుందుకు ఇచ్చేవాణ్ని.

ఒకనాడు ఆ ముసలాయన అన్నాడు "నువ్వు సోషలిస్ట్‌లా వున్నావే?" అని.

"కాదండి" అన్నాను.

"మరి, ఈ పుస్తకాలేమిటి?"

"ఏవో చదువుకుందుకు తెచ్చుకుంటాను. అన్నీ తెల్సుకోవాలికదా?" అన్నాను.

ఒకసారి వాళ్ళ అమ్మాయి చెప్పింది. ఆయనకూడా కొన్నాళ్లు కాంగ్రెస్ వుద్యమాల్లో పాల్గొన్నారనీ, ఇప్పుడు ముసలితనంచేతా, అనారోగ్యంచేతా రాజకీయాల్లోకి పోకపోయినా సానుభూతిమాత్రం చూపుతారని.

ఎంత ప్రయత్నించినా, ఈవేళ యీ తుఫానేమిటో అడిగి తెలుసుకోవాలనే కోరికను ఓడించలేకపోయాను.

"క్షమించాలి! మిమ్మల్ని కొన్ని విషయాలు అడగాలనుకుంటున్నాను" అన్నాను, గుమ్మందగ్గరకి వెళ్ళి.

ఆమె మడతకుర్చీమీద పడుకుని ఏదో దీర్ఘంగా ఆలోచిస్తోంది. నన్ను చూడగానే సర్దుకుని కూచుంది. నేను కూడా ఎదరవున్న కుర్చీమీదకూచున్నాను.

ఆమేం మాట్లాడలేదు. ఇష్టంలేదని ముఖం చిట్లింపులతోనన్నా తెలియలేదు. నా ప్రశ్న కోసరం ఎదురుచూస్తున్నట్టుంది!

"క్షమించాలని మొదలుపెట్టవల్సివచ్చినందుకు ఏమనుకోరనుకుంటాను. నేను వచ్చేటప్పటికి మీనాన్న కోపంగా మాట్లాడ్డం విన్నాను. ఈ నాల్గునెల్ల స్నేహంలోనూ మీ యింట్లో యిట్లాంటి సంఘటన చూళ్ళేదు. మీ రేమనకోనంటే అంతా చెప్పమని అడుగుతున్నాను".

పెద్దగా నిట్టూరుస్తూ వెనక్కి జార్లపడింది ఏమని సమాధానం చెపుతుందోనని ఎదురుచూస్తున్నాను కాసేపు ఇద్దరం నిశ్శబ్దంగా కూచున్నాం.

"మీ కేమన్నా కష్టంకలిగిస్తుంటే చెప్పండి" అన్నాను కొన్ని క్షణాలయ్యాక.

"కష్టమనికాదు. అదే ఆలోచిస్తున్నాను. ఎట్లా మొదలుపెట్టాలో తెలీడంలేదు".

ఒక్కొక్కమాటే జాగ్రత్తగా ఆలోచించి అంటోంది.

నేను మళ్ళీ అన్నాను!

"నన్ను మీరెరుగుదురుకదా? వేరే చెప్పనక్కర్లేదనుకుంటాను. వూరికే వినిపోవాలనికాదు. చేతనయితే ఏమన్నా సహాయంచేద్దామని.

కొన్ని నిమిషాలు ఆగి, మళ్ళీ అందుకుంది.

"మీ రెప్పుడన్నా ఆలోచించారో లేదో, "ఈమెకింకా పెళ్ళికాలేదేమా?" అని, ఆలోచించివుంటే ఆశ్చర్యపోయుంటారు. ఇదేమి సంస్కారం? ఇన్నేళ్ళొచ్చినా ఇంకా యింట్లో పెళ్ళిమాట ఆలోచించరేమా? అని.

మీరొక్కరూ ఆలోచించివుండకపోతే అది ప్రత్యేకవిషయం అనుకోండి. అట్లా ఆలోచించే చాలా మంది మనుషిల్ని గురించే మానాన్న బాధపడేది అందుకనే ఈవేళ ఆఖరుసారిగా ఆయన గదిమారు.

"ఇప్పుడు మీలో ఇంకో కొత్తప్రశ్న పుట్టుంటుంది. తండ్రిని అట్లా బాధపెడుతూ ఆమె ఎందుకింకా పెళ్ళిచేసుకోకుండా వుందా?అని"

ఇక్కడ కొంతసేపు ఆగింది. నేను సావకాశంగా వినడానికి సన్నాహపడుతున్నాను. ఆమె చెబుతోంది.

కాని... దానికి నేను సమాధానం ప్రత్యేకం చెప్పక్కర్లేదులెండి. సంగతంతా వింటే మీకే తెలుస్తుంది.

"– మూడేళ్ళకిందటిమాట. మీలానే ఎవరో గదికోసరమని తిరుగుతూ వొచ్చారు. మానాన్న, ఆయన చాలసేపుమాట్లాడుకున్నారు. మానాన్న ఎందుకు అంగీకరించాడో, ఏ నమ్మకం కలిగిందో నాకు తెలీలేదు. తర్వాత తెలిసింది, మానాన్న ఎరిగున్న కాంగ్రెసతని కొడుకని. అదే మొదటిసారి.

"కొంచెంగా రాజకీయజీవితానికి అలవాటుపడ్డ మానాన్న నన్ను మొదటినుంచీ ఎంతో జాగర్తగా పెంచాడు. తక్కిన పిల్లలందరికీ వుండే అదమాయింపులు, భయపెట్టడాలూ; రూళ్ళకర్ర చదువులూ నాకులేవు.

"అట్లాంటి ప్రత్యేక పరిస్థితులే నేను ఎక్కువ స్వతంత్రురాలిని కావడానికి తోడ్పడ్డాయనుకుంటాను. మీరు చాలామంది చదువుకున్న ఆడవాళ్ళని చూసివుంటారు. అందరూ వేరే ఆశయంలేనట్టు ఎంతసేపూ ఇతర్లని ఆకర్షించడానికి చేసే ప్రయత్నాల్లో

మునిగివుండడం గమనించి వుంటారు! ఇందుకేనా ఆడవాళ్ళకి స్వాతంత్ర్యం? అనే ప్రశ్న మీలో కలగవచ్చును.

"కాని నా అదృష్టమేమో నాకు వొచ్చిన స్వాతంత్ర్యం ప్రత్యేకం ఆమార్గాల్లో పోలేదు. చిన్నప్పటినుంచీ నేను పెరిగిన వాతావరణం కొత్తదారుల్ని ఏర్పరిచింది.

"మా నాన్నకి ఎంత రుణపడివుంటానోగాని నాకు సొంతానికి లేకుండా దేశానికి అనే దృష్టితో ఆలోచించడం నేర్పాడు ఎంతో విజ్ఞానం దేశభక్తికలగజేశాడు.

"కాని ఒకటే విచారం. నేను వేటినీ ఆచరణలో చూపించలేకపోతున్నాను. మానాన్న ముసలితనంవల్ల అంత బాధ్యత తీసుకోవడం లేదు. నాకీ యింటిపనితో రాజకీయాల్లో పాల్గొనడానికి వీలుకలగడంలేదు, నేనెంతగా ప్రేమిస్తున్నా వాటిని.

"అట్లాంటి సమయంలో ఆయన మానాన్నకిచ్చిన "కాంగ్రెసు చరిత్ర" చదువుతున్నాను. ఆయన తన గదికి పోతూ నేను ఆ పుస్తకం చదవడం చూశారు. అంతవరకూ నాక్కూడా రాజకీయాల్లో పరిచయముందని తెలీదు గావును ఆయనకు కొంతసేపయ్యాక కిటికీవద్దనించి చూస్తున్నారు. నాకు మొదట భయమేసింది. కాని వెంటనే సర్దుకుని "రండి, ఏమన్నాపనివుందా?" అన్నాను. ఆ మాటలు ఎట్లా అప్రయత్నంగా అన్నానో అనే ఆలోచనతో, తర్వాత ఎన్నిగంటలు గడిపానో!

"ఆయన చిరునవ్వునవ్వారు. ఎంత ప్రశాంతంగా నవ్వారని? ఆ ఒక్క నవ్వేచాలు! అట్లాంటి పురుషులు ఏ కొద్ది మందో అనుకున్నాను. ఎవరు ఎన్ని జన్మలనించి ఈయన కోసరం ఎంత తపస్సు చేస్తున్నారో

"ఏమిటి చదువుతున్నారు?" అంటూ మెల్లిగా లోపలికి వొచ్చారు. నేనాట్టే మాట్లాడలేదు.

"ఆయన ఎన్నోవిషయాలు చెప్పారు – 'దేశ స్వాతంత్ర్యంకోసం పురుషులతోపాటు స్త్రీలు కూడా సమాన బాధ్యత వహించాలి. జాతాయోద్యమంతోనే స్త్రీల అభివృద్ధికూడా పెనవేసుకువుంది. మీ వంటివాళ్ళు వఠి పుస్తకాలు చదవడంతోటే సరికాదు. వుద్యమాన్ని నడిపించడానికి, ఇంకా అజ్ఞానంలోవున్న ఎందరో స్త్రీలని మేల్కొల్పడానికి ముందంజవెయ్యాలి అంటాను' అన్నారు.

"ఎంత దీక్షతో వుద్రేకంతో చెప్పారో ఆ మాటలు మీకు వేరే చెప్పక్కర్లేదనుకుంటాను. అవంతటవే పలుకుతాయి.

"అదే మాస్నేహానికి మొదలు. తర్వాత నేమకూడా తరుచు సంభాణల్లో పాల్గొనేదాన్ని. ఆయన నాకోసం ప్రత్యేకంగా పుస్తకాలు" తెచ్చి ఇచ్చేవారు, నేనుకూడా అన్నీ శ్రద్ధగా చదివేదాన్ని.

"ఒకనాడు మావూరికి గృహలక్ష్మి సినిమా వొచ్చింది." అంతవరకూ మానాన్న ఏ సినిమాకి వెళ్ళనియ్యలేదు. నాక్కూడా సినిమాలంటే ఓవిధమైన ద్వేషం వుండేది. అందులో ఎన్నో కాంగ్రెసు సమస్యలు ఎత్తుకున్నారనీ గొప్ప చిత్రమనీ చెప్పారు ఆయన. ఇద్దరం కష్టపడి

మానాన్నని ఒప్పించాం. అదే మొదటిసారిగా సినిమా చూడడం. సినిమాలమీద దురభిప్రాయాలు కొన్ని పోయాయి. దేశభక్తి ప్రభోదానికి సినిమాలు ఎంతో తోడ్పడతాయని చెప్పారు ప్రభాకరరావు.

"– ప్రభాకరరావుమీద ఇదివరకువుండే అభిమానం కాకుండా, కొత్తస్నేహం కలుగుతోంది నాలో ఈ మార్పు విస్పష్టంగా గుర్తించాను. ఎప్పుడూ ఆయనతో మాట్లాడాలనీ, ఆయన మాట్లాడే రాజకీయాలు వినాలనే కోరిక ప్రబలమవుతోంది.

"కాని ఆయనకి ఎప్పుడూ తీరికవుండేదికాదు. ఏవో కొన్ని గంటలు కాలేజికి వెళ్ళడం, రాత్రి పన్నెండు, రెండు గంటలవరకూ ఏవోమీటింగ్‌లకి వెళ్ళి రావడం, వీటితో సరిపోయేది. ఎంత అలసిపోయినా విసుగూ విరామం వుండేది కాదు. ఎంతో ఓర్పు ఆ మనిషికి.

"ఒకనాడు మీటింగ్ వుందంటే నేనూ మానాన్నా చూడ్డానికి వెళ్లాం. కుర్చీమీద ఎవళ్ళు కూచున్నారోగాని, మీటింగ్ అంతా ఆయన ఆధిపత్యంకిందే జరిగినట్టుంది. ఆవేళ ఆయనకున్న గౌరవం, గొప్పతనం చూశాక ఆయనతో ఎట్లా మెలగాలో తెలీలేదు. ఎంతో గొప్పదనుకున్న నా తెలివంతా అణువులా కనిపించింది.

"అప్పటినించి మేం కలుసుకోడాలు, మానాన్న లేకపోయినా చర్చలు సాగించడాలు ఎక్కువ అయ్యాయి. ఇది మానాన్న గుర్తించకపోలేదు. ఎందుచేతో ఏమీ అనలేదు. మా దగ్గర్నించి ఏమంత చెడుగు ఆశించలేదో? లేకపోతే మా స్నేహానికి సమ్మతించాడో తెలీదు.

"ఆ వేళ మానాన్న వూళ్లోలేడు. ప్రభాకరరావు గారికి యింటి బాధ్యత అప్పగించి వెళ్ళిపోయారు. ఆయన మొదటిరోజున ఏమంత మాట్లాడలేదు. నాక్కూడా ఒంటరి తనం, కొంచెం జంకుపుట్టించింది.

"మర్నాడు ఆయన ఏదో సందర్భంలో మాట్లాడుతూ అన్నారు. ఏమీ గొప్పజీవితంకాదు నాది. జీవితంలో కలిగివుండాలనుకున్న ఆదర్శాలు, ఆవేశాలు నా జీవితాన్ని తొక్కిస్తే నూతనపంథాలు తొక్కించాలి. అంతే! ఎవళ్ళం జీవితంలో ఏం సాధించగలమో ముందరే చెప్పలేం చూడండి".

'అస్తమానూ మన జాతీయోద్యమాన్ని గురించే ఆలోచిస్తూవుంటాను. ఈనాడు కాంగ్రెసు యెంతబలం సంపాయించుకుంది దేశస్వాతంత్ర్యానికి కాంగ్రెసే ద్వారం తెరుస్తుందనేది నిర్వివాదాంశం. కాని ఏ పరిస్థితుల్లో ఎట్లా అనేది ఇప్పుడే చెప్పలేం'.

'చదువుకున్న వాళ్ళందరికేసీ ఎంతో ఆశతో చూస్తాను, "మీరు జాతీయోద్యమానికి యెందుకు తోడ్పడరు?" అని అడుగుదామని. కాని చాలమంది చదువుకున్న వాళ్ళకి అదేం పట్టనట్టుంది. కొంచెం చదువు, సంఘంలో ఔన్నత్యం సంపాయించుకోగానే ఒకవిధమైన గర్వం తలెత్తుతుంది వాళ్ళలో అందులో స్త్రీలు మరీని – చదువుకున్న వాళ్ళు తక్కువున్న మూలాన్నేమో యెక్కువ కనబడుతుంది వాళ్ళలో దాంతో తక్కిన స్త్రీలకి యెంతో

దూరమౌతున్నారు. ఇంక తక్కిన అజ్ఞానంలోవున్నవాళ్ళ కేవిధంగా తోడ్పడగలరో నాకు అర్థమవటంలేదు.

"మళ్ళీ కొంతసేపు చెప్పడం మానేశారు. నేను చూస్తూ కూచున్నాను? ఆయన మళ్ళీ అందుకున్నారు.

'ఇంకో విషయం వినండి మా నాన్నవాళ్ళూ అస్తమానం వివాహం విషయం తలపెట్టేవారు. నా ఆశయాలకు తోడ్పడేవాళ్ళెవ్వరూ కనపడలేదు. వాళ్ళకోరిక నెట్లా నెరవేర్చాలో నాకర్థంకాలేదు' కాని...

"ఆయన చెప్పడం మానేసి నావైపు చూస్తున్నారు, అమాయకంగా నాకర్థమయింది. నాగుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి.

"నేనే ఆయన భార్యనయితే... ఛా! పిచ్చికోరిక. కాని యెందుకు కాకూడదు? తమ ఆశయాల్నించి భర్తల్ని దిగజార్చే భార్యల్ని యెంతమందిని చూడలేదు. అట్లాంటి వాళ్ళెవరన్నా సంప్రాప్తిస్తే యెంత బాధపడతాడు ఈయన జీవితంలో ప్రతిఅంగుళాన్ని వెలిగించి, ఆశయాల్ని ముందుకు తీసుకుపోయే బాధ్యత యెందుకు తీసుకోకూడదు! పురుషుడు గొప్పవాడు కావడానికి అతని స్త్రీ మీద యెంత బాధ్యత వుంటుంది? ఇట్లాంటి వాళ్ళని వుద్రేకపర్చి, గొప్ప వాళ్ళనుగా చేసేవారు యెంతమందివున్నారు మన సంఘంలో? ఈ ప్రశ్నలన్నీ అతని భార్యని ఎందుకుకాకూడదు; అని మనస్సుని బలవంతపరుస్తున్నాయి.

"కాని..." అన్నాను.

'కాని... నా జీవితంలో, నా ఆదర్శాలతో సహకరించే స్త్రీ ఎప్పటికన్నా లభిస్తుందా? అని ఆలోచిస్తున్నాను' అన్నారు.

"మనస్సుని కప్పి పెట్టుకుంటూ, భయపడుతూ అడుగుతున్నాడు. నా యిష్టాన్ని ఎట్లా తెలీచెయ్యాలో నాకర్థమవడం లేదు. అయినా నన్ను మాత్రం అంగీకరిస్తాడని నమ్మకం ఏమిటి! నాలో ఏమీ లోపాలులేవని నేనుమాత్రం రూఢిగా చెప్పగలనా? ఇంకా అతను అంటున్నాడు.

'ఒక విషయం చెబుతాను కాని మీరు వేరేలా అర్థం చేసుకుందుకు వీల్లేదు. బాగా ఆలోచించండి. రోడ్డుమీది ప్రియుల్ని జ్ఞాపకం తెచ్చుకుని నెట్టకండి?'

'మిమ్మల్ని గురించే ఎంతో ఆలోచించాను. నాలోతడిమిచూసుకుంటే ఎంతో అగాధమైన ప్రేమవుంది మీమీద మీ స్నేహాన్ని కోరుకుంటున్నాను?'

"ఓ నిట్టూర్పువదిలి, ఇంటి కప్పువెతుకుతున్నారు. ఇక నా పరిస్థితి ఆలోచించండి. ఆయనమాట పూర్తయ్యే వరకూ నేను శ్వాసన్నా వదలలేదంటే నమ్మండి, ఎక్కడ మాట పోతుందోననే భయం. వింత ధైర్యం ఆశ్చర్యం అన్నీ నన్ను ముంచెత్తాయి!

"అట్లాంటి సమయంలో ఇంకోస్త్రీ అవుతే ఏం చేసుందురు? అర్ధరాత్రి ఒంటరిగా వెధవ గొడవలూ మీరును. మీ గౌరవం నిలుపుకోవాలంటె మెల్లగా బయటకు నడవండి.

లేకపోతే యెవర్నన్నా పిలిపించి బయటకు నెట్టాల్సొస్తుంది అని గంతులువేసుందురు.

"కాని అట్లాంటి వ్యక్తే ఆ మనిషిని ఎక్కువగా కోరుకుంటూవుంటుందనే సంగతి నేను వేరే చెప్పక్ఖర్లేదు. కాని గొప్పకోసరం నాటకం అదంతా వాళ్లే సినిమాల్లో, పార్కుల్లో దొంగచూపులు చూసేది. పురుషులందరినీ ప్రేమించినవాళ్ళని కాదు ఆకర్షించడానికి ప్రయత్నించేది పోనీలెండి వాళ్ళసంగతెందుకు, అసలు కథకువద్దాం?

"ఆయనకేం సమాధానం చెప్పాలో తెలీలేదు. ఎక్కువగా ప్రేమకథలన్నా చదివితే నేను. అనుకరిద్దామనుకున్నా. కళ్ళుమాత్రం సంతోషంతో నీళ్ళని నింపుకుంటున్నాయి.

"నిజమా" అన్నాను అప్రయత్నంగానే.

"అందులో ఏమంగీకారం ధ్వనించిందో కాని ఆయన వెంటనే నా పక్క దగ్గరికి వచ్చి, చేతి వేళ్ళను మెలివేస్తున్నారు. నేనులేచి కూచున్నాను".

'నిజం! మీ యిష్టమయితే మీ నాన్న గారికి కూడా ఎరుకపరుస్తాను?'

"నేను మెల్లగా చెయ్యి వదలించుకున్నాను, ముందు నాన్న అనుజ్ఞతీసుకోండి అన్నట్టు. తర్వాత ఇద్దరం అరుగు మీదికి వెళ్ళాం?

"ఆరుబయట చల్లగాలిలో కూచున్నాం. మా సన్నజాజిమొక్క వింతవాసనల్ని గుప్పేస్తోంది. ఆయన ఎంతో స్నేహంగా మాట్లాడారు. నేను కూడా నేను జన్మలో ఎప్పుడూ ఎవరికీ అంతపరిచయం చూపిఎరగను ఆయనలో ఎన్నడూ చూడని కొత్త అందాలు చూశాను ఆ రాత్రి.

"అదే మొదలు మా ప్రేమకి, అట్లా ఆ స్నేహంలో ఎన్నో రాత్రులు స్వంతం చేసుకోవాలనుకున్నాను.

"మర్నాడు నాన్న వొచ్చాడు. ఇంక నాన్నని అడుగుతారు నాన్న కూడా వ్యతిరేకించడు. లేకపోయినా ఒప్పించగలను అనుకుంటున్నాను.

"రెండురోజులు పోయినాక పొద్దున్నే తొమ్మిది గంటలకి ఆయన వచ్చారు".

'విమలా!'

"అదే మొదటిసారి నన్ను పేరు పెట్టిపిలవడం అయినా ఎన్నాళ్ళ స్నేహాన్నో పురస్కరించుకుని పిలిచినట్టుంది. నేను గుమ్మందగ్గరకి వచ్చాను".

'విమలా! మీ నాన్న ఏరీ?' ఆయనలో ఎంతో ఆతృత ఆరాటం కినిపించింది ఏం కొంపమునిగిందో.

"ఏమిటి సంగతి" అన్నాను.

'ఈ వేళ కాంగ్రెసునాయకులందర్నీ అరెస్టుచేశారు. దేశంలో పెద్ద విప్లవం వచ్చేలావుంది. మా కాలేజీలో అప్పుడే సమ్మె జరుగుతోంది. అవును! వచ్చే ప్రవాహాన్ని సరిగా నడిపించాలి.

ఎక్కడికక్కడ పోలీసులు ప్రజలబుర్రలు బద్దలుకొట్టాలని చూస్తున్నారు. ఈ సంగతి మీకు చెప్పిపోదామని వచ్చాను". అన్నారు.

"ఆయన హడావుడిగా వెళ్ళిపోయారు. మళ్ళీ నాలుగయిదురోజులవరకూ ఇంటికిరాలేదు. అక్కడ ఆ సమ్మెలో ఏం ప్రమాదం వచ్చిందో అని ఎంతో గాభరాపడ్డాను.

"రోజూ పేపరుచూస్తున్నాను. ప్రతీచోట సమ్మెలూ తీవ్ర వ్యతిరేకాందోళనా, ఎన్నో అరెస్టులూనూ

"ఆ రోజున సాయింత్రం వొచ్చారు."

"ఇద్దరం సావిట్లో కూచున్నాం! మీ కెక్కడ దెబ్బలు తగిలాయోనని భయమేసింది!" అన్నాను. "నాకేంభయం" అన్నట్టు చిరునవ్వునవ్వి చెప్పడం మొదలుపెట్టారు.

'నా గురించే చెబుదామని వచ్చాను. మీ నాన్నని అడిగేందుకు వీలుకలగలేదనే సంగతి నీకు తెల్సిందేగా ఇప్పుడు కొత్త సమస్యలెన్నో పోగయ్యాయి నాకు. నేను రేపు ఈవూరు వొదలేస్తున్నాను. మళ్ళీ ఆర్నెల్లవరకూరాను. నువ్వుమాత్రం రోజూ పేపర్లు చదివి సంగతులు తెల్సుకుంటూవుండు'.

"అంతే ఆయన వెళ్ళిపోయారు. కాని ఏ దీక్షతో ఆయన పనిచేస్తున్నారో, దేనికోసం ముందుజీవితంలో నా సహాయం కావాల్సివుంటుందనుకున్నారో, ఆ భావం నాకంత అధైర్యం కలగచెయ్యలేదు. అట్లాగే ధైర్యంగా సాగనంపాను.

"మీకు విసుగొస్తున్నట్టుంది వినడానికి. కథ చివరికి వచ్చిందిలెండి. అదే మా ఆఖరికలయిక ఆయన ఆర్నెల్లల్లో తిరిగివస్తానని చెప్పి మూడేళ్ళకిపైగా అయింది. ఇంకారాలేదు. ఆయన్ని గురించి ఎన్ని రాత్రులు ఆలోచిస్తూ గడిపానో? ఎందుకురాలేదు? నన్ను మరచిపోయివుంటారా? లేకపోతే ఏ కొట్లాటల్లో ఏమయ్యారో?

"మా నాన్న ఒకటి రెండుసార్లు పెళ్ళిమాట ఎత్తారు. తర్వాత ఏదో ఒక సమాధానం చెప్పి తప్పించుకుందామని చూశాను. ఈ సంఘటనలు జరిగి ఏడాది అయ్యేటప్పటికల్లా మానాన్న పెళ్ళివిషయం, ఎక్కువగా ప్రస్తావించాడు. నేను పరధ్యానంగా వుండడం, ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ వుండడం మూలాన ఏదో మార్పుల్ని చూచినట్టున్నాడు మా నాన్ననాలో.

"తర్వాత మానాన్నకి ఈ విషయం తెలియజేశాను. ఒక ఏడాదిపాటు నాన్నకూడా ఆయనకోసరం ఎదురుచూశాడు. అంతకంతకీ మానాన్నకి నమ్మకంపోయింది... ఎక్కడో ఈపాటికి సుఖంగా పెళ్ళిచేసుకుని వుంటాడు. నీగతి ఇంతే! అంటాడు మానాన్న. అందుకే ఈ తొందరా, బలవంతమూను.

"కాని నాకుమాత్రం నిరాశకలగలేదు. ఏచక్కని వుదయాన్నో వచ్చి నీకోసం ఎంత ఆరాటపడ్డానూ అని సంతోషంతో దగ్గరకు తీసుకోకపోతారా అని పిచ్చినమ్మకం. ఆయనలో నేను చూసిన గొప్పతనం, ఎంతో సహాయంచేస్తోంది".

విమల చెప్పడం పూర్తిచేసింది! పెదిమలు మాట్లాడ్డాం మానేసినా కళ్ళు ఇంకా ఆలోచిస్తూనే వున్నాయి.

అంతా విన్నాక ఏం సలహాయివ్వగలనో నాకే బోధపడ్డంలేదు.

నన్ను కొంచం ఆలోచించనియ్యండి మీకు మళ్ళీ వచ్చి నావుద్దేశం చెబుతాను. అంతా ఆశ్చర్యంగా వుంది వినడానికి' అని మెల్లగా లేచొచ్చి గది తలుపు వేసుకుని పార్కుకి బయలుదేరాను.

పార్కులో కూచున్నాను. విజయవాణి వార్తల్ని నిరాఘాటంగా ప్రసరిస్తోంది కాని, ఏదీ నా చెవులకు సోకడం లేదు.

"ఆజాద్ విమానంమీద కలకత్తా వెళ్ళారు విడుదలై'... నా బుర్రలోమాత్రం విమలసంగతే తిరుగుతోంది ఎంత ఆలోచించినా ఏసంగతి పాలుపోవడంలేదు.

"దయుంచి మీతో పదినిమిషాలు మాట్లాడనిస్తారనుకుంటాను".

–ఎవరో సన్నని పొడుగాటిమనిషి అంటున్నాడు.

"మీ పక్కని కూచుంటాను". – నేనేంమాట్లాడ్డం లేదు చెప్పేదంతా విందామని చూస్తున్నాను.

"మీరు నన్ను సరిగా ఎరగరా. మిమ్మల్ని నేనుకూడా ఎరగననుకోండి. కొన్ని క్షణాల పరిచయమే, మీతో మాట్లాడేలా చేసింది. మీరేమీ శ్రమఅనుకోరనుకుంటాను.

"మీరు చాలా అదృష్టవంతులు. అందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను. కారణం తర్వాత తెలుస్తుంది.

"ఇప్పుడే ఆగస్టు వుద్యమంలో అరెస్టు అయినవాళ్ళనందర్నీ వొదిలేస్తున్న సంగతి మీకూ తెల్సినదేకదా?

"నా మిత్రుడొకడు నిన్ననే జైలునుండి విడుదలైవచ్చాడు. అతను అరెస్టయి మూడేళ్ళయింది. అంతకుపూర్వం ఇక్కడ కాలేజీలో చదువుతుండేవాడు.

"చదువుకునేరోజుల్లో, తనుండే ఇంట్లో అమ్మాయితో స్నేహం కలిగింది. తర్వాత కొన్నాళ్ళకి ఇద్దరూ పెళ్ళిచేసుకుందామనుకున్నారు.

"కాని అతను ఉద్యమంలోపడి, కొన్నాళ్ళలో వస్తానని వెళ్ళిపోయాడు. తర్వాత అరెస్టయ్యాడు. ఉత్తరాలు రాసేందుకన్నా వీలుకలగలేదుట.

"ఆమె మాత్రం ఏం చేస్తుంది చెప్పండి. ఎన్నాళ్ళపాటు ఎదురుచూసిందో, ఏమో? చివరికి నిరాశచెందినట్టుంది. ఎంత ప్రేమకల వాళ్ళమయినా మనమేం ఋషులంకాము చూడండి. ఆజన్మాంతం ప్రేమించినవాళ్ళకోసం ఎదురుచూస్తూ కూచోడానికి.

"అతనికంటే అదృష్టవంతు డిప్పుడు వాళ్ళింట్లో వుంటున్నాడు ఆమె ప్రేమంతా అతనిమీదికి మళ్ళించినట్టుంది. ఇద్దరు బహుశా పెళ్ళిచేసుకుని సుఖంగావుంటునట్టున్నారు.

"ఈ వేళ నామిత్రుడు ఆమెని చూడ్డానికి ఆతృతతో వెళ్ళాడు. కాని ఆమెమాత్రం ప్రియుడితో సంతోషంతో మాట్లాడుకోడం చూశాడు. ఆమెమీద ఇదివరకు కలిగివున్న స్నేహాన్ని పోగొట్టుకోలేదు కాని ఇప్పుడామె ఇంకొకళ్ళ స్త్రీ అనుకుంటున్నాడు.

"అయినా ఒకసారి మాట్లాడిపోదామా? అనుకున్నాడు. కాని మగవాళ్ళలోపాలు అతనికితెల్సు. అందుచేత అతనికి భయం వేసింది; ఆమె భర్త ఏం అనుమానిస్తాడో అని కనక చూడ్డానికి ధైర్యం చెయ్యలేకపోయాడు.

"మీరు ఆశ్చర్యపోతున్నట్టున్నారు మీకు సమ్మతంలేని విషయం మీకెందుకు చెబుతున్నానా అని. మీ వుద్దేశం తెల్సుకుందామని. ఇంక అయిపోయిందిలెండి నేను చెప్పాల్సింది. మిమ్మల్ని అట్టే వేధించదల్చుకోలేదు"

ఒక నిమిషం ఆగి నావైపు చూస్తున్నాడు. నేను మామూలుధోరణిలో వింటున్నట్టు నటిస్తున్నాను.

"నన్ను సొల్యూషన్ అడుగుదామనుకుంటున్నారా" అన్నాను.

"కాదులెండి"

"ఇంతకూ చెప్పాల్సింది, ఆ స్నేహితుణ్ణి నేనే. ఆ అదృష్టవంతుడు మీరు. నేను మీరు ప్రేమించిన స్త్రీతో వుండడం ఇవ్వాళ చూశాను. ఒకసారి మాట్లాడేందుకు అంగీకరిస్తారని ఆశిస్తున్నాను".

చెప్పడంమానేసి, గడ్డిపరకల కేసి చూస్తున్నాడు.

ఎవరు? ప్రభాకరరావా!!

ఇందాక మాట్లాడుకుంటున్నప్పుడు చూశాడా? పాపం ఎంతబాధపడ్డాడో?

మళ్ళీ పరీక్షించి చూశాను. అవును! ఆ ఖద్దరులాల్చీ అతను, ప్రభాకరరావు!! నాకు ఎట్లా గౌరవించాలో తెలీలేదు.

"మీరు ప్రేమించిన స్త్రీ మీకోసమే ఎదురు చూస్తోంది. ఎవరిమీదకీ తనప్రేమని మరలించుకోలేదు. రాత్రి తొమ్మిదిగంటలకి ఇక్కడికి రండి ఆమెని కల్సుకునేటట్టు చేస్తాను, అని సెలవుతీసుకుని, ఇంటిదారిపట్టాను.

అప్పటికే బాగా చీకటిపడింది. మెల్లగా ఇంటికి చేరుకున్నా.

నేను వెళ్ళేటప్పటికి విమల సావిట్లో కూచునివుంది ముసలాయన కోపంతో ఇంటికిరానట్టుంది.

"మీరు త్వరగా అరగంటలో పార్కుకిరండి మీ ప్రియుడ్ని చూపిస్తాను చాలా అలసిపోయివున్నాడు. మీకోసం కళ్ళు కాయలు కాచినట్టున్నాయి". అన్నాను.

ఆమె ఏ సమాధానం చెప్పకముందే మళ్ళీ తిరిగి వెళ్ళిపోయాను.

పార్కులో పచారుచేస్తున్నాను అరగంటలో ఆమె వచ్చింది. మెల్లగా కుర్చీవైపు తీసుకువెళ్ళాను. అక్కడ కూచున్నాం.

"ఏరీ, ఆయన?"

ఎంతో ఆతృతతో అడుగుతోంది. నేను సావకాశంగా అంటున్నాను.

"తొందరపడకండి. మీరు ప్రేమించినతను కాదు. మీ ప్రియుడు. మిమ్మల్ని ప్రేమిస్తున్న ఇంకోమనిషి. అతను వేరు"

"మిమ్మల్ని చూచినప్పట్నించి. వివాహంచేసుకోవాలనుకుంటున్నాడు. మీరు అంగీకరిస్తారా లేదాఅన్నదివేరే విషయం. ముందర మీకు తెలీచెయ్యడానికే ఇక్కడకురమ్మన్నది. నిజంగా అతను ప్రభాకరరావంత గొప్పవాడుకాకపోవచ్చు. ఒక్కొక్కప్పుడు అతనికంటె గొప్పవాడయినా కావచ్చును.

అయినా మీనాన్నని గురించి కూడా ఆలోచించండి ఆయన ఎంత బాధపడివుండకపోతే మిమ్మల్ని అట్లా మధ్యాహ్నము కోప్పడతారు.

"మీరు ప్రేమించిన మనిషి ఏకారణంచేతో రాకపోతే మీరెంతో బాధపడుతున్నారు. అట్లాంటప్పుడు మిమ్మల్ని ప్రేమించినతన్ని మీరు స్వయంగా నిరాకరిస్తే ఎంతబాధపడతాడో అర్థం చేసుకోవడం మీకేమంత కష్టం కాదనుకుంటాను. మిమ్మల్ని ఈ రాత్రి ఇక్కడకు తీసుకువచ్చింది బాధపెట్టడానికి కాదు.

"ఆ ప్రేమించిన మనిషి నేను అంగీకరించానని చెప్పండి చాలు". అన్నాను, ఆమెవైపు తదేక దీక్షతో చూస్తూ, చెబుతున్నంతసేపూ ఆశ్చర్యంతో చూస్తోంది.

"మీతో..." ఆమె పెదిమలు కదుల్తున్నాయి. గేటు దగ్గర చప్పుడయింది. ఆమె చెప్పడంమానేసింది ఇద్దరం గేట్‌వైపు చూస్తున్నాం.

ప్రపంచమంతా చీకటలో మునిగివుంది. రోడ్డుమీద లైట్లకాంతి క్రోటన్సు ఆకులమీద పడుతోంది. ఇందాక పార్కులో కలిసిన మనిషి మావైపు వస్తున్నాడు.

"అరుగో ఆయన"

చప్పున అరుగుదిగి, అటువైపు పరుగెత్తింది విమల అతనుకూడా పట్టరాని సంతోషంతో వున్నట్టున్నాడు. నేను నా కథ పూర్తికాలేదే అని విచారిస్తున్నాను.

విమల "ఇంత అబద్ధమా! మోసగించారని ఎంత కోపమొచ్చింది మీ మీద" అన్నట్టు చూస్తోంది.

నేను షరాయి దులుపుకుంటూ లేచాను:

"ఇంకా భోజనం చెయ్యలేదు. వెళ్ళివస్తానండీ, ప్రభాకరరావుగారూ!" అన్నాను.

"వీళ్ళకి పూర్వపరిచయ మెక్కడవుందా?" అని ఆశ్చర్యపోయింది విమల.

నా నడతకి సమాధానం చెప్పుకోలేక చూస్తున్నాను ఆమెని వెళ్ళిపోతూ

"మీకు నా అభినందనాలు. నేను దసరాకి ఇంటికి వెళ్ళిపోతున్నాను. మీరు మాత్రం పెళ్ళిసమయానికి పిలవాలి. అధ్యక్షుడిగా పిలవాలి! లేకపోతే నేను ఒప్పుకోను మీకు మంచిపుస్తక మొక్కటి బహుమతిగా తెస్తాను.

"మీ జీవితంలో చీకటి తెరలు తొలగిపోయాయి. దేశంలోవికూడా తొలగించడానికి యత్నించండి"

మర్నాడుదయం ఈ వుత్తరం చదువుకుని వుంటారు వాళ్ళు.